క్లుప్తంగా

ఘనంగా సీపీఐ ఆవిర్భావ ఉత్సవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సామేలప్ప

ఆదోని రూరల్: స్థానిక చదువుల రామయ్య నగర్, కల్లుబావిల గ్రామంలో శుక్రవారం సీపీఐ ఆవిర్భావ ఉత్సవాలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు సామేలప్ప, గోవిందమ్మ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు పేదల పక్షాన వారి అభ్యున్నతికి ప్రభుత్వాలపై పోరాటాలు కొనసాగిస్తూనే ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి విజయ్, లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ నాయకులు వెంకన్న, షాబీర్‌బాషా, శ్రీకాంత్, ఏపీ మహిళా సమైక్య నాయకులు కోటమ్మ, మాణిక్యమ్మ, లూర్దమ్మ, సీపీఐ నాయకులు అనుమప్ప, రాముడు, గిరి, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

31లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడిమెట్ల సహకార సొసైటీ పరిధిలోని రైతులు, అప్పుదారులు ఈ నెల 31లోపు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సొసైటీ సీఈవో దత్తాత్రేయ, పీఐ శ్రీకాంత్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సొసైటీలో పంట అప్పులు, రైతు నేస్తం, రైతు మిత్ర అప్పుదారులు మీ గ్రామ పరిధిలోని సచివాలయాల్లో ఆధార్, పాన్ కార్డులను తీసుకెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు

ఎమ్మిగనూరుటౌన్: బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాపోరాటాలు చేయక తప్పదని సీపీఐ నాయకులు సమీవుల్లా, తిమ్మగురుడు, దాదావలి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని 33వ వార్డులో సీపీఐ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.

అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తాం

గోనెగండ్ల: డిసెంబర్ 31 రాత్రి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాని సూచించారు. రోడ్లపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించమని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. న్యూ ఇయర్ సందర్భంగా ఏర్పాటు చేసుకున్న బ్యానర్లు, ఫ్లెక్సీలు చింపరాదన్నారు. పోలీసుల నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

తుపాను ముప్పుతో ఆందోళన

- మిరపను కాపాడుకునేందుకు అవస్థలు
- దిగుబడులను అరబెట్టేందుకు అనుకూలించని వాతావరణం



మిరప దిగుబడిని ఆరబెట్టిన రైతులు

నందవరం: ఆరుగాలం శ్రమించిన రైతన్న తుపాను తాకిడితో తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. గత మూడు, నాలుగు రోజులుగా ఆకాశం మబ్బులు కమ్మి మేఘావృతం కావడంతో పాటు చిరు జల్లులు కురుస్తున్నాయి. దీంతో పంట దిగుబడులను కాపాడుకునేందుకు రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారు. నది తీర ప్రాంతాలైన నదికైరవాడి, గంగవరం, జోహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి తదితర గ్రామాల్లో రైతులు మిరప, వరి ధాన్యం కోతలు పూర్తి చేసుకున్నారు. తుపాన్ తాకిడితో చిరుజల్లులు కురవడంతో మిరప రంగు మారుతుందని, ధాన్యం తడిసి పోతుందని ఆందోళన చెందుతున్నారు. కోత కోసిన వరి ధాన్యం, మిరప దిగుబడులను కల్లాల్లో ఆరబోసుకోవడంతో తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అష్టాకష్టాలు పడుతున్నారు. ధాన్యం, మిరపను టార్పాలిన్ పట్టలతో కప్పి ఉంచారు. ఆరబెట్టేందుకు వాతావరణం అనుకూలించకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఓ పక్క వర్షాలు, మరోపక్క గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



ఆదోనిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి

బాబూ... ఏంటీ బాదుడు!

- కూటమి సర్కార్ పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ గళమెత్తిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు తరలిరావడంతో కిటకిటలాడిన ఆదోని పట్టణం
- మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ
- విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయం ఎదుట ధర్నా.. ఏడీకి వినతి అందజేసిన మాజీ ఎమ్మెల్యే



విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆదోని టౌన్: కూటమి సర్కార్ పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు గళమెత్తారు. సీఎం చంద్రబాబూ... ఏంటీ బాదుడు అని నిలదీస్తూ కదం తొక్కారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వంపై పోరుబాటకు తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో ఆదోని పట్టణం కిటకిటలాడింది. మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్కేడీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి చేపట్టిన బైకు ర్యాలీని మాజీ ఎమ్మెల్యే సాయి జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌ను ఎక్కించుకుని సాయి ప్రసాద్‌రెడ్డి స్వయంగా బైక్ నడిపారు. భీమా సర్కిల్, పాతబస్టాండ్ మీదుగా విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయం వరకు సాగిన బైక్ ర్యాలీ హోరెత్తింది. అనంతరం డీఈ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. కూటమి సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. బాబు ఏంటీ బాదుడు అంటూ నినదించారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ డిమాండ్ చేశారు. తదనంతరం ఏడీ పురుషోత్తం, ఏఈ హరికి నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే సాయి వినతి పత్రం అందజేశారు.

ప్రజలను మభ్యపెట్టడం.. బాబు నైజం

ప్రజలను మభ్యపెట్టి మాయ చేయడం సీఎం చంద్రబాబు నైజమని, అయితే వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిలుదీస్తుందనే విషయాన్ని మరిచిపోవద్దని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ హెచ్చరించారు. డీఈ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలను ఉద్దేశించి వారు ప్రసంగించారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. ఒక్క రూపాయి కూడా కరెంట్ చార్జీలు పెంచం... ప్రజల వద్దకే పాలన కొనసాగిస్తాం.. వలంటీర్ల సేవలు కొనసాగుతాయి... సూపర్ సిక్స్ పథకాలతో మీ జీవితాలు మార్చుతాం తదితర హామీలు గుప్పించి మభ్యపెట్టి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు వెంటనే కరెంట్ చార్జీలు పెంచి తన నైజాన్ని నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. మాటకు కట్టుబడి ఉండడం చంద్రబాబు చరిత్రలోనే లేదని విమర్శించారు. అధికారం కోసం ఇష్టారాజ్యంగా హామీలు కురిపించిన చంద్రబాబు నేడు కాలయాపన ప్రసంగాలతో ప్రజలను మభ్యపెడుతున్నారని, ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయడం లేదని నిలదీశారు. సంపద సృష్టించడం అంటే పేదలపై భారం మోపడమేనా అని ప్రశ్నించారు. ప్రజలపై భారం మోపితే సహించేది లేదని, వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కూటమి సర్కార్ ఇదే పద్ధతని కొనసాగిస్తే ప్రజా వ్యతిరేకత చవిచూస్తారని హెచ్చరించారు.

ఎమ్మెల్యే పార్థసారథి.. ఉత్తి మాటలొద్దు!

అదృష్టం వరించి గెలిచిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి సైతం ప్రజలను మాయమాటలతో మభ్యపెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యేగా ఎన్నుకున్న ప్రజలకు సేవలు చేయకుండా తాను చెబితే సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పినట్లేనని గొప్పలు చెప్పుకోవడం ఏమిటని ఎద్దేవా చేశారు. అంత సత్తా ఉంటే ఏదైనా చేసి చూపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఒట్టి మాటలు కట్టిపెట్టి... చేతల్లో చూపించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, మున్సిపల్ విభాగం జిల్లాధ్యక్షుడు నాగరాజ్, మహిళా నాయకురాళ్లు శ్రీలక్ష్మి, మంజుల, రేణుక, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పోలకల్ మునిస్వామి, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, రాజేశ్వరరెడ్డి, రహమాన్, తాయన్న, చలపతి, మధు, గోవిందరాజులు, నాయకులు నల్లారెడ్డి, అమాన్, ప్రతాపరెడ్డి, బి.తాయన్న పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కూటమి మోసంపై పోరుబాట



మంత్రాలయంలో జాతీయ రహదారిపై ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మంత్రాలయం: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుపై పోరు దండు కదం తొక్కింది. పేదల తరఫున పోరుబాట పట్టింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాటలో అడుగులో అడుగై ముందుకు సాగింది. కూటమి ప్రభుత్వ కపట నీతిని ఎలుగెత్తి చాటింది. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ భారీ ర్యాలీతో పాటు ధర్నాకు పూనుకున్నారు. మండల కేంద్రంలోని భూ రమణ కల్యాణ మండపం నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా 167వ జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్రాన్స్‌కో కార్యాలయం చేరుకుని 2 గంటలకు పైగా ధర్నా చేపట్టారు. ధర్నాలో ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూటమి ప్రభుత్వం కూలిపోక తప్పదు

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కూటమి ప్రభుత్వం కూలిపోక తప్పదని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం హామీలను విస్మరించి ప్రజలపై భారం మోపే పనిలో పడిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండు పర్యాయాలు విద్యుత్ చార్జీలు పెంచడం ఘోరమన్నారు. విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై రూ.15 వేల కోట్ల అదనపు భారాన్ని మోపారని, చంద్రబాబు చెప్పిందే శాసనంగా కూటమి ప్రభుత్వం నడుస్తోందన్నారు. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ సైతం చంద్రబాబు తీరుకు జీ హుజూర్ పలుకుతున్నాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలు పాటిస్తున్నా పవన్‌కళ్యాణ్ పల్లెత్తు మాట అనడం లేదన్నారు. నెలకో సమస్యను తెరపైకి తేవడం సూపర్ సిక్స్‌ను మరిపించడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. చంద్రబాబు మోసపూరిత తీరు ఏమాత్రం మారలేదని, ముమ్ముందు కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చేప్పేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జగనన్న సారథ్యంలో ప్రజా పోరాటాలకు దిగుతామని స్పష్టం చేశారు. పోరుబాటలో పార్టీ మండల కన్వీనర్లు జి.భీమారెడ్డి, బెట్టనగౌడ్, ప్రహ్లాదాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, ఎంపీపీలు అమరేష్, పెండేకల్లు ఈరన్న, సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, రామాంజనేయులు, పాల్‌దినకర్, నాయకులు పరమేష్, మల్లికార్జున, శివారెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బాదుడుపై పెల్లుబికిన ప్రజాగ్రహం

- విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ
- విద్యుత్ డీఈ కార్యాలయం ముందు ధర్నా



ఎమ్మిగనూరులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బుట్టా రేణుక



ఎమ్మిగనూరు విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని ప్రజలను మభ్యపెట్టే హామీలు గుప్పించి అధికార పీఠం ఎక్కిన తరువాత సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలు మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబునాయుడికే దక్కిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు వెళ్లి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు రుద్రగౌడ్, బీఆర్ బసిరెడ్డి, బుట్టా శివనీలకంఠ, లక్ష్మికాంతరెడ్డిలతో కలిసి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస థియేటర్ సర్కిల్ మీదుగా మార్కెట్ కమిటీ నుంచి విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం చేరుకుని ధర్నా చేపట్టారు. డీఈ బిజయరాజు, ఏడీఈకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలో ప్రజలపై ట్రూఅప్ చార్జీల పేరుతూ రూ.15,485 కోట్ల భారం మోపడం దారుణమన్నారు. అడ్డగోలుగా ప్రజలపై పన్నుల భారం మోపుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధిని విస్మరిస్తోందన్నారు. అబద్ధాలు చెప్పి గద్దెనెక్కి ప్రజలపై భారం మోపడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోను చెత్తబుట్టలో పారవేసి విద్య, వైద్య రంగాలను విస్మరించి అన్నింటా విఫలమైందన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకున్నా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన భారాన్ని రద్దు చేయాలని లేకపోతే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీ నాయకులు, శాప్ నెట్‌వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, కేవీ.కృష్ణారెడ్డి, శివప్పగౌడ్, గడ్డం నారాయణరెడ్డి, విరుపాక్షిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, రియాజ్‌అహమ్మద్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్, కామర్తి నాగేషప్ప, బందెనవాజ్, మల్లికార్జున రెడ్డి, కోటేకల్ లక్ష్మన్న, దొరబాబు, మన్సూర్, కాశీవిశ్వనాథ్‌రెడ్డి, భాస్కర్, నరసింహులు, మహబూబ్‌బేగ్, దేవరాజు, మాబాషా, అబ్రార్, రాజారత్నం, సోమేష్, నర్సన్నాచారి, బజారి, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి పాటుపడిన మన్మోహన్ సింగ్



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బుట్టా రేణుక, నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఆర్థిక సంస్కరణలతో దేశాభివృద్ధికి పాటుపడిన మహోన్నతమైన ఆర్థిక వేత్త మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మన్‌మోహన్ సింగ్ చిత్రపటానికి ఆమెతో పాటు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా బుట్టా రేణుక గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవలింగాయత్ అధ్యక్షుడు రుద్రగౌడ్, మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి లక్ష్మీకాంతారెడ్డి, రియాజ్ అహమ్మద్, మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, నాయకులు విరుపాక్షిరెడ్డి, బందెనవాజ్, గడ్డం నారాయణరెడ్డి, సునీల్‌కుమార్, ఎంకె శివప్రసాద్, కామర్తినాగేషప్ప, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఖాశీంవలి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రఫీక్ బాషా, అన్సర్, హర్ష, విష్ణు, అజయ్, సోమిరెడ్డి, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: భారతదేశ 13వ ప్రధాని, పద్మవిభూషణ్ డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు శుక్రవారం స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. మన్మోహన్ ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కరస్పాండెంట్ దూద్‌బాషా మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించిన మేధావి అని కొనియాడారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజినేయులు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరులో ఈనెల 29,30 తేదీల్లో నిర్వహించనున్న 23వ సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రామాంజినేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో నాయకులతో కలిసి మాట్లాడారు. నాయకులు రాధాకృష్ణ, హనుమంతు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: ఎమ్మిగనూరులో 29, 30 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా మహాసభల పోస్టర్లను శుక్రవారం ఆదోని సుందరయ్య భవన్‌లో నాయకులు ఆవిష్కరించారు. కార్మికులు, కర్షకులు తరలివచ్చి మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

నందవరం: సీపీఎం జిల్లా 23వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గురుశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రం నందవరంతోపాటు ముగతి, నాగలదిన్నె, మాచాపురం, గంగవరం గ్రామాల్లో సీపీఎం జీపు జాతా చేపట్టారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు రంగప్ప, బి.రాజు, బతకన్న, లక్ష్మీనారాయణ, బాలు, అబ్దుల్లా పాల్గొన్నారు.

కౌతాళం: ఎమ్మిగనూరులో ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పోస్టర్లను విడుదల చేశారు.

పెద్దకడబూరు: ఈ నెల 29, 30 తేదీలలో ఎమ్మిగనూరు పట్టణంలో జరిగే సీపీఎం 23వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తిక్కన్న, సీనియర్ నాయకులు పరమేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు.

కోసిగి: ఎమ్మిగనూరు జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కన్వీనర్ రాముడు, కమిటీ సభ్యులు వీరేష్, హనుమంతు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక దుకాణాల వద్దకు వెళ్లి కరపత్రాలు విడుదల చేశారు. ఇక్కడి ప్రాంత ప్రజల సమస్యలను మహా సభలలో చర్చించి ప్రణాళిక తయారు చేస్తామన్నారు. సభలకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హొళగుంద: మండలంలోని చిన్నహ్యాట కొండలో పేకాట ఆడుతున్న ఏడుగురుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాల నరసింహులు శుక్రవారం తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు కొండలో పేకాట ఆడుతుండగా దాడి చేసి ఏడుగురిని అదుపులో తీసుకుని రూ.19,590 నగదు, 6 బైకులు, పేక ముక్కలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

యువకుడి ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సున్నం బట్టీల ప్రాంతంలో యువకుడు సీతారామరాజు(26) మనస్థాపంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతారామరాజుకు నందవరానికి చెందిన మల్లేశ్వరితో నాలుగేళ్ల కిత్రం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు. అయితే మల్లేశ్వరి నందవరంలోని బావ వీరేష్‌తో సన్నిహితంగా ఉంటుందని అనుమానంతో భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకొని ఎవ్వరికి చెప్పకుండా వెళ్లిపోయింది. విషయాన్ని నందవరం వీరేష్ దృష్టికి తీసుకెళ్లగా అసభ్య పదజాలంతో తిట్టడంతో సీతా రామరాజు తీవ్ర మనస్థాపం చెందాడు. అవమానంతో ఇంటికి వచ్చి ఎవ్వరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరిదేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతుడి భార్య మల్లేశ్వరి, నందవరం వీరేష్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు రాత్రి తెలిపారు.

సస్యరక్షణతో నాణ్యమైన దిగుబడులు



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర

మంత్రాలయం: సస్యరక్షణ పద్ధతులతో మిరపలో మేలైన దిగుబడులు సాధించవచ్చని కేవీకే సమన్వయ కర్త, డాక్టర్ రాఘవేంద్ర సూచించారు. శుక్రవారం మండలంలోని సూగూరు గ్రామంలో ఉద్యానవన శాఖ డివిజన్ అధికారిణి అపర్ణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ.. మిరపలో ప్రస్తుత కాలంలో నల్లతామర, బూడిద తెగులు, కాయమచ్చ తెగులు ఎక్కువగా ఉంటుందన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించి సస్యరక్షణ చేపట్టాలని సూచించారు. పంట మార్పిడితోపాటు మిరపలో బార్డర్ క్రాప్‌లు, బంతిపూలు వేసుకోవాలన్నారు. అలాగే నీలిరంగు, పసుపు రంగు అట్టలను ఏర్పాటు చేసుకోవడంతో నల్లతామరను అదుపు చేయవచ్చన్నారు. రసాయనాల పిచికారి తగ్గించి ఘన జీవామృతం, ద్రవ జీవామృతం ఎరువులను వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా ఉద్యానవన పంటలు పెంచుకుంటే సాగులో రాణించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డ్రిప్ ఎంఎల్ఏఓ నాగరాజు, సమంతపాల్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పెంపకంపై దృష్టి సారించాలని కోరారు.

పెద్దకడబూరు: ఉల్లి, మిరప పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి సూచించారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో మంత్రాలయం డివిజన్ ఉద్యాన శాఖాధికారిణి సి.అపర్ణ ఆధ్వర్యంలో మిరప, ఉల్లి పంటలల్లో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం ఏర్పాటుచేశారు. మిరపలో నల్ల తామర, బూడిద తెగులు, కాయకుళ్లు నివారణకు సూచనలు చేశారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

కౌతాళం: కౌతాళం, బదినేహాల్ సహకార సంఘా ల సభ్యులు ఈ-కేవైసీ చేయించుకోవాలని పీఏసీ రామరాజు, సీఈఓ వెంకటేష్ తెలిపారు. వారు శుక్రవారం మాట్లాడుతూ.. ఆయా సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారంతా ఆధార్‌కార్డు, పాన్ కార్డు తీసుకుని వెళ్లి సచివాలయాల్లో ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈనెల 31వ తేదీ లోపు ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

గోనెగండ్ల: ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఖాతాదారులు సచివాలయాల్లో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సంఘం సిబ్బంది రమాదేవి, శ్రీనివాస్‌లు తెలిపారు. శుక్రవారం హెచ్. కైరవాడి, గోనెగండ్ల సహకార సంఘాల ఖాతాదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ రాయితీలు లభిస్తాయని తెలిపారు. అలాగే ఓటు హక్కు కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం సిబ్బంది గోపాల్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, హనుమంతు, దినేష్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు: సహకార సంఘం ఖాతాదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ పరపతి సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈ-కేవైసీ చేయించుకోవడం వల్ల ప్రభుత్వాలు అందించే రాయితీలను రైతులు పొందవచ్చన్నారు. అలాగే సంఘంలో ఓటు హక్కు కలిగి ఉంటారని లేకపోతే కోల్పోతారని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది చేత పకడ్బందీగా ఈకేవైసీ చేస్తున్నామని, రైతులు సహకరించాలని కోరారు.